
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట



# ముగ్గురు ముగ్గురే..

## మెదక్ పార్లమెంటులో పోరు ఆసక్తికరం




- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఇప్పటికే ప్రజాక్షేత్రంలోకి బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు
- నీలం మధుకే కాంగ్రెస్ టికెట్
- ప్రచారమే లక్ష్యంగా ఎవరి వ్యూహాలు వారివే

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి28 : ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో మెదక్ పార్లమెంటు ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, బీఆర్ఎస్ తరఫున మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి పేర్లు ఖరారయ్యాయి. తాజాగా నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటించింది. దీంతో ప్రచారమే లక్ష్యంగా ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమయ్యారు. రఘునందన్ రావు, వెంకట్రామారెడ్డి సన్నాహక సమావేశాలు, కార్యకర్తల సభలు, విభిన్నవర్గాలతో ముఖాముఖి కార్యక్రమాలు చేపడుతున్నారు. నీలం మధు సైతం గురువారం రంగంలోకి దిగారు. పలువురు కాంగ్రెస్ నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.



### రెండోసారి రఘునందన్ పోటీ

మెదక్ బీజేపీ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్‌రావు రెండోసారి బరిలోకి దిగుతున్నారు. 2019 ఎన్నికల్లో పోటీచేసిన ఆయనకు 2,01,567 ఓట్లు పోలయ్యాయి. ఆనాడు మూడోస్థానంలో నిలిచారు. తర్వాత జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి విజయం సాధించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో మళ్లీ ఓటమి ఎదురైంది. ఈ క్రమంలో మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా మరోసారి అవకాశం ఇప్పించాలని అధిష్ఠానాన్ని కోరారు. స్థానిక సమీకరణాల దృష్ట్యా రఘునందన్ వైపే పార్టీ మొగ్గు చూపింది. తన అభ్యర్థిత్వం ఖరారైన మరుక్షణం నుంచే తన వ్యూహాలకు పదును పెట్టారు. బూత్ కమిటీల వారీగా సమావేశాలు నిర్వహించారు. విభిన్న వర్గాలతోనూ ముఖాముఖి చర్చలు జరిపారు. గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మెదక్‌లో రెండోసారి పోటీ చేయడం రఘునందన్‌కు అనుభవపరంగా కలిసొచ్చే అంశం. ఓడిన సానుభూతి, బీజేపీ ఓటు బ్యాంకు, మోదీ చరిష్మాతో పాటు ఇతరాత్ర అంశాలు తన విజయానికి దోహదం చేస్తాయని ఆశిస్తున్నారు.

### వార్డు మెంబర్ టు ఎంపీ అభ్యర్థిగా..

పటాన్‌చెరు మండలం చిట్కూల్ గ్రామంలో వార్డు సభ్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నీలం మధును కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థిగా బరిలో నిలిపింది. 2006లో వార్డు సభ్యుడిగా, 2014లో ఉప సర్పంచ్‌గా, 2019లో చిట్కుల్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2014లో బీఆర్ఎస్ నుంచి పటాన్‌చెరు జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన మధుకు భంగపాటు ఎదురవ్వడంతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లోనూ టికెట్ దక్కకపోవడంతో ఆ వెంటనే బీఎస్పీలో చేరి ఎమ్మెల్యేగా పోటీచేసి పరాజయం చవిచూశారు. తాజాగా మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మధుకు కీలకమైన పార్లమెంటు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ముదిరాజ్ సామాజికవర్గంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు, ఆ పార్టీ సంక్షేమ పథకాల లబ్ధిదారుల మద్దతు దక్కుతుందనే దీమాతో ఉన్నారు.

### వ్యూహాత్మకంగానే వెంకట్రామారెడ్డి

మెదక్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. నెల క్రితమే మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి పేరును ఆ పార్టీ తెరమీదకు తెచ్చింది. ఆయనకే టికెట్ ఖరారు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత వెంకట్రామారెడ్డి పేరు కనుమరుగై మరికొందరి పేర్లు చర్చకొచ్చాయి. అయితే ఈ పేర్లన్నింటిపై కార్యకర్తలు, ముఖ్యనేతలతోపాటు ప్రజల్లోనూ అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిసింది. దీంతో వెంకట్రామారెడ్డి వైపే మొగ్గు కనిపించడంతో మళ్లీ ఆయనను ఫైనల్ చేశారు. సిద్దిపేట కలెక్టర్‌గా, ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, డ్వామా పీడీగా సుదీర్ఘకాలం పనిచేసిన వెంకట్రామారెడ్డి పరిచయం అక్కర్లేని వ్యక్తి కావడంతో ఆయన్నే బరిలో దింపారు. దీనికితోడు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలుంటే ఆరింట్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. అదే విధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించారు.

**మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో విజేతలు**

| సంవత్సరం | ఎంపీ | పార్టీ |
|---|---|---|
| 1952 | ఎన్.ఎం జయసూర్య | పీడీఎఫ్ |
| 1957 | పి.హన్మంతరావు | కాంగ్రెస్ |
| 1962 | పి.హన్మంతరావు | కాంగ్రెస్ |
| 1967 | సంగం లక్ష్మీబాయి | కాంగ్రెస్ |
| 1971 | మల్లికార్జున్ గౌడ్ | టీపీఎస్ |
| 1977 | మల్లికార్జున్ గౌడ్ | కాంగ్రెస్ |
| 1980 | ఇందిరాగాంధీ | కాంగ్రెస్ |
| 1984 | పి.మాణిక్ రెడ్డి | టీడీపీ |
| 1989 | ఎం.బాగారెడ్డి | కాంగ్రెస్ |
| 1991 | ఎం.బాగారెడ్డి | కాంగ్రెస్ |
| 1996 | ఎం.బాగారెడ్డి | కాంగ్రెస్ |
| 1998 | ఎం.బాగారెడ్డి | కాంగ్రెస్ |
| 1999 | ఆలె నరేంద్ర | బీజేపీ |
| 2004 | ఆలె నరేంద్ర | టీఆర్ఎస్ |
| 2009 | విజయశాంతి | టీఆర్ఎస్ |
| 2014 | కేసీఆర్ | టీఆర్ఎస్ |
| 2014 (ఉ/ఎ) | కొత్త ప్రభాకర్‌రెడ్డి | టీఆర్ఎస్ |
| 2019 | కొత్త ప్రభాకర్‌రెడ్డి | టీఆర్ఎస్ |

### ముగ్గురికీ పటాన్‌చెరు నేపథ్యం..

మెదక్ పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇందులో పటాన్‌చెరు సైతం ఒకటి. కాగా ప్రస్తుతం ప్రధాన పార్టీల తరఫున బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులకూ పటాన్‌చెరు నియోజకవర్గ నేపథ్యం ఉండడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఇదే పటాన్‌చెరులో జర్నలిస్టుగా, న్యాయవాదిగా పనిచేయడంతోపాటు జడ్పీటీసీగా పోటీ చేశారు. తన రాజకీయ ప్రస్థానం ఇక్కడి నుండే ప్రారంభమైంది. తర్వాత తన స్వస్థలమైన దుబ్బాక వేదికగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఇదే పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ సర్పంచ్‌గా ఇటీవలి వరకు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగానూ పటాన్‌చెరులో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సైతం పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండలం తెల్లాపూర్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. తన కుటుంబానికి సంబంధించిన ఓట్లన్నీ ఇదే నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ముగ్గురికి కూడా పటాన్‌చెరు ప్రాంతంతో సంబంధాలు నెలకొన్నాయి. అంతేగాకుండా జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న గాలి అనిల్‌కుమార్ కూడా పటాన్‌చెరు నివాసి కావడం గమనార్హం.

### ఇందిర నియోజకవర్గం

తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో మెదక్ స్థానానికి ప్రత్యేకత ఉంది. ఇదే లోక్‌సభ నుంచి 1980లో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ పోటీచేసి గెలుపొందారు. దీంతో మెదక్ పేరు ఆనాడు దేశంలోనే మార్మోగింది. ఇందిరా నియోజకవర్గంగా గుర్తింపు దక్కింది. ఆ తర్వాత టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వరుసగా ప్రాతినిధ్యం వహించారు. ఇక 2004 నుంచి 2019 పార్లమెంటు ఎన్నికల వరకు బీఆర్ఎస్ హవా కొనసాగింది. పదేళ్ల ఉద్యమం, మరో పదేళ్ల అధికార పర్వంలో ఈ స్థానాన్ని బీఆర్ఎస్ నిలబెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కేంద్రంలో బీజేపీ ధీమాగా ఉండడంతో ఇక్కడి పోటీ రసవత్తరంగా మారనున్నది.

# యువతే కీలకం

## 39 ఏళ్ల లోపు ఓటర్లు 9,52,583 మంది

- అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించేది వారే
- మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో ఓటరు నమోదుకు స్పందన

మెదక్, మార్చి 27: మెదక్ లోకసభ నియోజకవర్గ పరిధిలో గెలుపు ఓటములను నిర్ణయించడంలో యువ ఓటర్లు, మహిళలు కీలకం కానున్నారు. వారు ఎటు వైపు మొగ్గు చూపితే వారే విజేతలుగా నిలిచే అవకాశం ఉంది. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంటలో మొత్తం ఓటర్లు 18,19,397 మంది కాగా.. వీరిలో 39 ఏళ్ల లోపు వయసు వారు 9,52,583 మంది ఉండడం విశేషం. ఈసారి భారీగా కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారు. 18-19 ఏళ్ల వయసు వారు 53,458 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. కళాశాలల్లో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఇతర వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయడంతో సత్ఫలితాలను ఇచ్చింది. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈలోపు యువ ఓటర్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది.

**మహిళలూ నిర్ణయాత్మకమే..**

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లూ నిర్ణయాత్మక ప్రాత్ర పోషించనున్నారు. మెదక్ లోక్‌సభ నిమోజకవర్గ పరిధిలో 9,21,400 మంది మహిళా ఓటర్లున్నారు. ఇందులో 39 ఏళ్ల లోపు వారు 4,73,463 మంది ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించడంలో మహిళా ఓటర్లూ కీలకం కానున్నారు.

**పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వివిధ వయసుల ఓటర్లు**

| వయసు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| 18-19 | 30,315 | 23,132 | 53,458 |
| 20-29 | 2,01,444 | 1,94,676 | 3,96,228 |
| 30-39 | 2,47,176 | 2,55,655 | 5,02,897 |
| 40-49 | 1,91,954 | 1,95,332 | 3,87,303 |
| 50-59 | 1,17,696 | 1,25,800 | 2,43,498 |
| 60-69 | 69,246 | 76,605 | 1,45,855 |
| 70-79 | 32,952 | 39,383 | 72,336 |
| 80-89 | 6,284 | 9,356 | 15,640 |
| 90-99 | 680 | 1,389 | 2,069 |
| 100-119 | 40 | 69 | 109 |
| 120 పైన | 1 | 2 | 3 |
| మొత్తం | 8,97,788 | 9,21,400 | 18,19,397 |

## బస్సుల్లో నగలు కాజేసే

# పార్థీ గ్యాంగ్ అరెస్ట్

- 12.5 తులాల బంగారం రికవరీ
- ఐదుగురు సహా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

7లో



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

# ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- సమావేశానికి హాజరైన 9 మంది సభ్యులు
- నేరుగా క్యాంపు నుంచి సమావేశానికి..



అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు

కొండపాక, మార్చి 28 : కొండపాక మండల పరిషత్ అధ్యక్షురాలు రాగల సుగుణపై అవిశ్వాసం నెగ్గింది. కొండపాక ఎంపీపీపై ఈనెల5న అవిశ్వాసం ప్రకటిస్తూ తొమ్మిది మంది సభ్యులు ఆర్డీవోకు తీర్మాన పత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం ఇచ్చిన నాటి నుంచి క్యాంపునకు వెళ్లిన ఎంపీటీసీ సభ్యులు నేరుగా సమావేశానికి హాజరయ్యారు. తొమ్మిది మంది అవిశ్వాసానికి మద్దతు తెలియజేశారు. అవిశ్వాసం నెగ్గిందని, నివేదికనుపై అధికారులకు పంపిస్తామని తెలిపారు. అధికారుల సూచన మేరకు ఎంపీపీ ఎన్నికకు తేదీ ప్రకటిస్తామని ఆర్డీవో తెలిపారు. కొండపాక మండలం ఎంపీపీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో కొండపాక ఎంపీటీసీ సభ్యురాలు మంచాల అనసూయకు దక్కనున్నది. అవిశ్వాస సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఐదేళ్ల పాలనలో ఎంపీటీసీలకు నిధులు, గౌరవం ఇవ్వకపోడంతో బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కొండపాక ఎంపీటీసీ సభ్యురాలు మంచాల అనసూయ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# నింద మోయాల్సి వస్తుందేమోనని..

- ట్రాక్టర్ ప్రమాదంలో ముగ్గురి మృతితో పెళ్లి కుమారుడి తాత ఆందోళన
- ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య
- పెళ్లి జరగాల్సిన రోజే నలుగురి అంత్యక్రియలు

పాపన్నపేట, మార్చి 28: బంధుమిత్రుల సంబురాల మధ్య వేడుకగా పెళ్లి జరగాల్సిన ఆ ఇంట మరో విషాదం నెలకొన్నది. మెదక్ జిల్లా అందోల్ మండలం మన్సాన్‌పల్లి వద్ద బుధవారం పెళ్లి బృందంతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడటం.. ఆ ప్రమాదంలో వరుడి తరఫువారు ముగ్గురు మృత్యువాతపడిన ఘటన జరిగిన మర్నాడే ఆ ఇంట మరో దిగ్భ్రాంతికరమైన ఘటన జరిగింది. ట్రాక్టర్ ప్రమాద ఘటనతో వరుడి తాత తీవ్ర ఆవేదన చెందాడు. మనుమడి పెళ్లి ఆగిపోవడం.. మృతి చెందిన ముగ్గురూ పాలోళ్లే కావడంతో తాను బతికి ఉన్నంత కాలం ఆ నింద మోయాల్సి వస్తుందేమోనని తీవ్ర ఆందోళన చెందాడు. ప్రమాదం జరిగిన మర్నాడు తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచారం గ్రామంలో వరుడి ఇంట విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన సొంగ రమేశ్‌కు సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన అమ్మాయితో పెళ్లి కుదరింది. గురువారం పెళ్లి కోసం బుధవారం వరుడి కుటుంబసభ్యులు, బంధువులు ట్రాక్టర్‌లో బాచారం నుంచి బయలుదేరారు. అందోల్ మండలం మన్సాన్‌పల్లి ట్రాక్టర్ వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో పెళ్లి కుమారుడి పాలోళ్లు ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటనతో పెళ్లి ఆగిపోయింది. కుటుంబం మొత్తం విషాదంలో మునిగి ఉండగా, వరుడి తాత సొంగ పెంటయ్య (68) గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. 12 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందడంతో బాచారం గ్రామంలో విషాదం నెలకొంది. గురువారం నలుగురి అంత్యక్రియలు జరిగాయి.



రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్‌లో పెంటయ్య ఫైల్‌ఫొటో)

### చెదిరిన పెళ్లి కళ.. శోక సంద్రంలో బాచారం

పెళ్లి జరగాల్సిన ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. పెళ్లి బాజాలతో కళకళలాడాల్సిన ఇల్లు రోదనలతో నిండిపోయింది. 12 గంటల వ్యవధిలో ఒకే గ్రామంలో.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడడంతో ఊరంతా శోకసంద్రంగా మారిపోయింది. మరణించిన రావుగారి బూదమ్మ, రావుగారి ఆగమ్మ ఇద్దరూ తోడికోడళ్లు. సొంత అక్కాచెల్లెళ్ల వలె కలిసిమెలిసి ఉండేవారు. అదే అనుబంధంతో బుధవారం పెళ్లికూతురుని తెచ్చేందుకు వెళ్తూ మృత్యువాతపడ్డారు. విడివిడిగా మెట్టినింటికి వచ్చినా తోటికోడళ్లిద్దరూ కలిసి కాటికి వెళ్తున్న తీరు అందరినీ కదిలించింది. వారికి వరుసకు మామ అయ్యే పెంటయ్య మృతదేహానికి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు పరామర్శించారు.

# భగీరథ యత్నం

- అడుగంటుతున్న భూగర్భజలం.. ఎండుతున్న పొలం
- బావుల్లో పూడికతీతలు, బోర్లు
- ఆందోళనలో మెట్ట ప్రాంత రైతులు




హుస్నాబాద్ మండలంలో బోరు వేస్తున్న దృశ్యం

హుస్నాబాద్, మార్చి28: హుస్నాబాద్ మెట్టప్రాంత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మొన్నటి వరకు చెరువు, కుంటలు నిండుకుండలను తలపించగా.. నేడు భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండుముఖం పడుతున్నాయి. చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. బోర్లు వేస్తూ, బావులను పూడిక తీయిస్తున్నారు.

హుస్నాబాద్ మెట్టప్రాంతంలో 15 రోజుల నుంచి భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి 700 ఫీట్ల లోతు వరకు బోర్లు వేస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే 2 నుంచి 3 వరకు బోర్లు వేసిన రైతులు కూడా ఉన్నారు. ఓ రైతు బోరు వేస్తే అందులో నీరు పడిగానే.. ఆశగా ఆ పక్కనున్న పొలంలో మరో రైతు బోరు వేస్తున్నాడు. అక్కడ నీరు రాకపోతే.. మరోచోట బోరు వేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యవసాయబావుల్లో రూ.వేలు వెచ్చించి పూడిక తీయిస్తున్నారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో ఈ 15 రోజుల వ్యవధిలో క్రేన్లు, బోర్లు జోరుగా నడుస్తున్నాయి.

### పెరిగిన సాగు విస్తీర్ణం

హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండాయి. ఈ యాసంగి సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువ సాగయ్యింది. డివిజన్‌లోని హుస్నాబాద్ మండలంలో 11,070 ఎకరాల్లో వరి, 3,117 మొక్కజొన్న, అక్కన్నపేట మండలంలో 12,311 ఎకరాల్లో వరి, 425 ఎకరాల్లో మొక్కజొన్న, కోహెడ మండలంలో 20,252 ఎకరాల్లో వరి, 2,591 ఎకరాల్లో మొక్కజొన్న, బెజ్జంకి మండలంలో 11,788 ఎకరాల్లో వరి, 2,264 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. మొత్తంగా 55,423 ఎకరాల్లో వరి, 12,279 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. పంట చేతికొచ్చేందుకు ఇంకా నెల సమయం ఉంది. ఈ తరుణంలో బోర్లు, బావులు అడుగంటుతుండడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానాకష్టాలు పడుతున్నారు. కొన్ని చోట్ల బోర్లు, బావులు ఎత్తిపోవడంతో ఇప్పటికే పంటలు ఎండిపోయి పశువులకు గ్రాసంగా మారింది. ఎండిన పంటలపై సర్వే నిర్వహించి పరిహారం అందించి మెట్ట రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అక్కన్నపేట మండలంలో బావిలో పూడిక తీస్తున్న రైతులు



హుస్నాబాద్ మండలంలో వ్యవసాయ బావుల్లో క్రేన్లతో పూడిక తీయిస్తున్న రైతులు



వ్యవసాయ బావిలో పూడిక తీసి క్రేన్‌తో పైకి వస్తున్న రైతులు



నీరందక పశువులు, గొర్లు, మేకలకు గ్రాసంగా మారిన వరిపైరు

## బెల్టు షాప్‌పై దాడి.. కేసు నమోదు

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో నడుపుతున్న బెల్ట్‌షాపులపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కోడూరి పద్మ, కోడూరి రమేశ్ అక్రమంగా నిలువ ఉంచిన 31.015 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అనుమతి లేకుండా బెల్టు షాపులను నడపవద్దని హెచ్చరించారు.

## వ్యసనాలకు బానిసలు కావొద్దు : సీఐ బి.సైదా



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ బి.సైదా

గజ్వేల్, మార్చి 28: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కావొద్దని గజ్వేల్ సీఐ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గురువారం చట్టాలు, బాల్యవివాహాలు, సైబర్‌నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్‌వార్డెన్ లక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ సంజీవరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్(ఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శి నియామకం

రాయపోల్, మార్చి 28: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్, ఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా రాయపోల్ మండలం కొత్తపల్లికి చెందిన పుర్ర నర్సింలును నియమించారు. ఈ మేరకు గురువారం ఆయనకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ రమేశ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్, ఏబీసీడీల వర్గీకరణ సాధనకు నిరంతరం పోరాడాలని ఆయన సూచించారు. పుర్ర నర్సింలు మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయాధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చేనేత విగ్రహ ఆవిష్కరణ



చేనేత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీ వేములఘాట్‌లో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో, చేనేత విగ్రహాన్ని సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికి విశేష ప్రాధాన్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గాడిపల్లి శ్రీనివాస్, పద్మశాలి యువజన అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, నాయకుడు నాగరాజు నేత, ఎల్లం రాజు, లక్ష్మణ్, సత్యనారాయణ, తుమ్మ నర్సింలు గాడిపల్లి బలరాం, హనుమాన్‌దాస్, విలాస్, వెంకటేష్, తిరుపతి పద్మశాలి సంఘం నాయకులు ఉన్నారు.

## టికెట్ కేటాయించడం హర్షణీయం

దుబ్బాక, మార్చి 28: బీసీ బిడ్డ నీలం మధును కాంగ్రెస్ పార్టీ మెదక్‌పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమని ఆపార్టీ దుబ్బాక మండల అధ్యక్షుడు కొంగరి రవి అన్నారు. నీలం మధుకు టికెట్ కేటాయించడంతో గురువారం దుబ్బాక బస్టాండ్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా టపాసులను పేల్చి, మిఠాయిలను పంచుకున్నారు. కాంగ్రెస్‌పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను అధిష్ఠానం గుర్తిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగానే బీసీలకు మెదక్‌పార్లమెంట్ స్థానాన్ని కేటాయించడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఎసురెడ్డి, మచ్చశ్రీనివాస్, నరేందర్, భరత్, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

# బ్రహ్మోత్సవ శోభ

● రేపటి నుంచి బొంతపల్లి వీరన్న ఆలయంలో ఉత్సవాలు

● ఏర్పాట్లలో అధికారులు

● మూడు రాష్ట్రాల్లో ప్రసిద్ధి

గుమ్మడిదల, మార్చి 28 : భక్తుల కొంగుబంగారమైన బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్ర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి వచ్చే నెల 7 వరకు కొనసాగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

## 500 ఏళ్ల చరిత్ర

హైదరాబాద్ నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో మెదక్ హైవేకు సమీపంలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయానికి 5 శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయ కాలంలో ఈ ఆలయం నిర్మితమైనట్టు చిత్రకారులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు దట్టమైన అరణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో స్వామివారు పాముల పుట్టలో స్వయంభువుగా వెలిసినట్టు చెప్పుకుంటారు. స్వామివారు భక్తులకు కలలో కనిపించి ఆనవాళ్లు చెప్పడంతో అప్పటి పాలకులు, వ్యాపారులు అదే ప్రాంతంలో భారీ ఆలయాన్ని నిర్మించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలో భక్తులు ఇక్కడి స్వామిని ఇలవేల్పుగా కొలుస్తారు. వారంతా శుభకార్యాలు, వివాహాలు జరుపుకునే ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, వీరభద్ర ప్రస్తాయం నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తుంటారు. శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయాన్ని ప్రస్తుతం విస్తరిస్తున్నారు. ఈక్రమంలో నాలుగు వైపులా ప్రాకారాలు, సత్రాలు నిర్మిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేటిని పునరుద్ధరించారు. ఇందుకోసం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప, పాలక మండలి సభ్యులు కృషి చేశారు.



వీరభద్రస్వామి దేవాలయం





భద్రకాళీ అమ్మవారు, వీరభద్రస్వామి వారి విగ్రహాలు

## బ్రహ్మోత్సవాల వివరాలు

వీరభద్రస్వామి ఆలయంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30న ప్రారంభమవుతాయి. శనివారం ఉదయం సుప్రభాతం, బిందె తీర్థం, బాలభోగము, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి నందివాహన సేవ నిర్వహిస్తారు. 31న ఆశ్వవాహన సేవ, 1న హంసవాహన సేవ, 2న బృంగీశ్వర వాహన సేవ, 3న పొన్నవాహన సేవ, అగ్నిగుండాలు తొక్కడం ఉంటుంది. 4న కల్యాణోత్సవం, 5న రథోత్సవం, 6న దోపుసేవ, మిరిమిడి, పూర్ణాహుతి, రాత్రి నాక బలి నిర్వహిస్తారు. 7న ఏకాకంత సేవ, డోలోత్సవం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఈవో

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శశిధర్‌గుప్తా తెలిపారు. ఉత్సవాలకు మూడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు కల్పిస్తున్నామన్నారు. వేసవి తీవ్ర దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాభవాని క్షేత్రం

● ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నేటి నుంచి మూడు రోజులు వేడుకలు

● 31న లక్ష దీపోత్సవానికి ఏర్పాట్లు

సంగారెడ్డి రూరల్, మార్చి 20 : సంగారెడ్డికి మండల పరిధిలోని ఈశ్వరాపురం (ఇస్మాయిల్‌ఖాన్ పేట) గ్రామంలో వెలసిన సప్త ప్రాకారయుత శ్రీదుర్గా భవాని మహాక్షేత్రం వార్షికోత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో లక్ష దీపోత్సవం, శతచండీ యాగం, సహస్ర చండీ మహాయాగం, ఆయుత చండీ మహాయాగం, కోటి కుంకుమార్చన, శతరుద్ర, మహారుద్ర యాగాలు, చరుద్వేద పారాయణం నిర్వహించనున్నట్టు ధర్మాధికారి రాధాకృష్ణమూర్తి తెలిపారు.



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని దుర్గాభవాని మహాక్షేత్రం

### ఉత్సవాల వివరాలు

ఉత్సవాలు శుక్రవారం ఉదయం మహాగణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. రేపు ఉదయం నుంచి మహాయాగ నిర్వహణ, లక్ష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగాలు, కుంకుమార్చన, సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లాతో పాటు హైదరాబాద్ నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

## వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మహా పూర్ణహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 28: సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో, గురుమదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతీ చేతుల మీదు ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఆలయంలో వేద పండితులు యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతాపూజలు, గర్తన్యాసం, యంత్ర మూర్తి ప్రతిష్ఠ, తదుపలి కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, బలి ప్రదానం, పూర్ణహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు అనిల్ గుప్తా, అర్చనగుప్తా దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. వేడుకలకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో సంతాన మల్లిఖార్జున క్షేత్ర వ్యవస్థాపకుడు చెప్పెల హరినాథ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ యాయవరం రాజశేఖరశర్మ, దాచేపల్లి వెంకటకృష్ణ, సత్యనారయణ, ఇర్రి మల్లారెడ్డి, బెజగాం వాసు గుప్తా, గంగిశెట్టి సుధాకర్‌గుప్త, ఆలయ వేద పండితులు గుండేశ్వరశర్మ, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ్రపతిష్ఠాపన



హనుమాన్ ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

సదాశివపేట, మార్చి 28: పట్టణంలోని 6వ వార్డు కృష్ణనగర్ కాలనీలో నిర్మించిన పంచముఖ హనుమాన్ మందిరంలో ఆంజనేయ, గణపతి, శివలింగం, నంది, నవగ్రహ, నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభించారు. వేదపండితుడు విఘ్నేశ్వరపూజ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నెమలికొండ వేణుమాధవ్ ఆలయ అభివృద్ధికి రూ.1,10,000 విరాళంగా అందజేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్, కౌన్సిలర్ గుండు రవి, ఆలయ కమిటీ సభ్యులు దోమకొండ నరేష్‌కుమార్, మంబిగారి ఆంజనేయులు, ఆటిపాముల నందు, కొత్త రమేష్, బామిని రవి, కళ్యాణ్ రాజు, గురుగుల నాగరాజు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ వేడుకలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న పురోహితులు

సంగారెడ్డి రూరల్, మార్చి 28: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ పున ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా అయ్యప్ప స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు జయప్రకాష్, రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి సాగర్, ఉపాధ్యక్షుడు శేషగిరి, సహాయ కార్యదర్శి గోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ్, కమిటీ సభ్యులు ప్రసాద్, వీరకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# బస్సుల్లో నగలు కాజేసే పార్థీ గ్యాంగ్ అరెస్ట్

● 12.5 తులాల బంగారం రికవరీ

● ఐదుగురు సహా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం



పార్థీ ముఠాను చూపుతున్న పోలీసులు

తూప్రాన్, మార్చి 28: బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల మహారాష్ట్ర పార్థీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 12.5 తులాల బంగారు ఆభరణాలు, చోరీకి ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తుప్రాన్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి గురువారం నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లో నివాసముండే మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన ఉప్పల శ్వేత గత నెల 27న హైదరాబాద్ వెళ్లేందుకు తూప్రాన్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కుతుండగా, ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 12.5 తులాల బంగారు నగలు చోరీ జరిగాయి. దీంతో తుప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి, నిందితులు కారులో పరారైనట్లు గుర్తించారు. కారు నంబర్ (ఎంహెచ్ 23 బీహెచ్ 1608) ఆధారంగా నిందితుల కోసం వేట సాగించారు. అయితే, అదే కారులో బంగారం అమ్మేందుకు వెళ్తుండగా దాబా హోటల్ వద్ద వారిని పట్టుకున్నారు. కారులో మహారాష్ట్ర పార్థీ ముఠాకు చెంఇన వైశాలి విజయ్ సోలంకే (49), అతడి భార్య విజయ్ బీంరావు సోలంకే (39), హినా కరణ్ రహడే (21), ఈమె భర్త కరణ్ సంతోష్ రహడే (24), జయశ్రీ అంకుష్ సోలంకే (32)లు ఉండగా అరెస్ట్ చేశారు. వారిని విచారించగా, తూప్రాన్ బస్టాండ్‌లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేశారు. అలాగే, కారు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వైశాలి విజయ్, అతని భార్య విజయ్ బీంరావులు గతంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట, షాద్‌నగర్, తిరుమల లలో చోరీలకు పాల్పడ్డారని, 2019 నుంచి వారిపై కేసులు ఉన్నాయని ఎస్పీ వివరించారు. చోరీ కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకట్‌రెడ్డి, సీఐ రెడ్డబోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం, సిబ్బందిని అభినందించారు. కానిస్టేబుళ్లు గోవర్ధన్, నాగేంద్ర బాబు, వెంకట్ లను అభినందిస్తూ వారికి నగదు రివార్డును ఎస్పీ బాలస్వామి అందజేశారు.

# డబ్బు సంచులతోనే వెంకట్రామారెడ్డికి బీఆర్ఎస్ టికెట్

● అక్రమ సంపాదనతో వంద కోట్లకు ఎకరం కొనుగోలు

● ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపు ఖాయం

● మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



నారాయణరావుపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతునప్న రఘునంధన్‌రావు

నారాయణరావుపేట, మార్చి 28: అక్రమంగా సంపాదించిన డబ్బు సంచులతోనే మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి బీఆర్ఎస్ టికెట్ కొనుక్కున్నాడని మాజీ ఎమ్మెల్యే, మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎమ్మెల్యేలు పార్టీ మారకుండా తలా రూ.పది కోట్లు ఇచ్చి పార్టీ మారకుండా ఆపారని ఆరోపించారు. వెంకట్రామారెడ్డి అక్రమ సంపాదనతో ఎకరం భూమిని రూ.వంద కోట్లకు కొన్నాడని ఆరోపించారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా మెదక్ పార్లమెంట్‌ను బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. తాను దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు అవమానించారని నేడు సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అదే అవమానం జరుగుతుందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలందరూ బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీకి మద్దతు తెలపడం అభినందనీయమని రఘునందన్‌రావు అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పవణ్‌కల్యాణ్, నాయకులు నర్సాగౌడ్, నాయకుల రమేష్‌గౌడ్, శీకాంత్, బాబు పాల్గొన్నారు.

# కార్యాలయాలు తెరుచుకోవా?

● రెండు రోజులుగా మూసిఉన్న డీఎల్పీవో, ఏపీడీ ఆఫీసులు





గజ్వేల్ పట్టణంలోని డీఎల్పీవో, ఏపీడీ కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

గజ్వేల్, మార్చి 28: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గల పలు కార్యాలయాలు తెరచుకోవడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమో.. విధుల పట్ల నిర్లక్ష్యమో తెలియదు కానీ ఎప్పుడు చూసినా కార్యాలయాలకు తాళాలు వేసి ఉంటున్నాయి. గజ్వేల్ డివిజన్‌గా అవతరించిన అనంతరం గజ్వేల్‌కు పలు డివిజన్ కార్యాలయాలు మంజూరవగా గజ్వేల్ పట్టణంలోని సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనంలో కార్యాలయాలు కేటాయించారు. సదరు కార్యాలయాలకు సరిపడా నియమకాలను చేపట్టకపోవడంతో డివిజన్ స్థాయి అధికారులే తాళం తీసుకుని వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కోవలోకే గజ్వేల్ పట్టణంలో డీఎల్‌పీవో, ఏపీడీ, పంచాయతీరాజ్ క్యూసీ, ఎస్సీడబ్ల్యూవో కార్యాలయాలు ఉన్నాయి. గడిచిన రెండు రోజులుగా ఈ కార్యాలయాలు మూసి ఉండడం గమనార్హం.

## సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కొల్చారంలోని మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, మార్చి 28: మిల్లర్లు సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి పారా బాయిల్డ్ రైస్‌మిల్, శ్రీ శ్రీధర్ రైస్‌మిల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. రైస్ మిల్‌లో బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం డెలివరీ, యాసంగి, రబీ 2022-23 సంబంధించిన బియ్యం అప్పగించాలని, వానాకాలం సీజన్‌కు టెండర్ పూర్తి అయిన ధాన్యం వెంటనే అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. 2021-22 రబీ, 2021-22 ఖరీప్ ధాన్యం బియ్యం అప్పగింతలు పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు ఈ సంవత్సరం ఏప్రిల్ 30లోగా డెలివరీ పూర్తి చేయాలని, పూర్తి చేయకుంటే మిల్లర్లపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికిష్ణ, మిల్లుల యజమానులు శ్రీనివాస్, ఆశ్నగారి కిష్టయ్య, ప్రభాకర్, ప్రణీత, సాధిక్ తదితరులు ఉన్నారు.

## పోలీస్‌స్టేషన్లను సందర్శించిన సిద్దిపేట సీపీ



చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

చేర్యాల/మద్దూరు, మార్చి 28: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట సీపీ అనురాధ గురువారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి విధుల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను గుర్తించి ముందస్తు చర్యలతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బైండోవర్ కేసులు, ప్రైవేట్ గన్ డిపాజిట్, ఫ్లాగ్‌మార్చ్ తదితర వివరాలపై ఆరా తీశారు. ఎన్నికల వేళ పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజల్లో నమ్మకం, ధైర్యాన్ని పెంపొందివజేస్తూ ధైర్యంగా ఓటువేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత నేరస్తులు, గత ఎన్నికల్లో నేరాలు చేసిన వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను మభ్యపెట్టే వారిపై నిఘాపెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఆమెవెంట హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్, నాగరాజు, మద్దూరు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, ఏఎస్ఐ జగదీశ్వర్, విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

## బైక్‌ను లారీ ఢీకొని యువకుడి మృతి

సదాశివపేట, మార్చి 28: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్(20) గురువారం సాయంత్రం 7గంటల సమయంలో నిజాంపూర్ వైపు నుంచి సదాశివపేటకు బైక్‌పై వెళ్తున్నాడు. బైపాస్ రోడ్డును దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంగమేశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్ తెలిపారు.

## 50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలి

● జహీరాబాద్‌లో సీఐటీయూ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జహీరాబాద్, మార్చి 28: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం అంతకంతకు విస్తరించడంతోపాటు పరిశ్రమలు కూడా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కార్మికుల ఇబ్బందులను గుర్తించి పట్టణంలో 50పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ కోరారు. గురువారం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రివద్ద సీఐటీయూ నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 30వేల మంది పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంపై దృష్టిపెట్టకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి జహీరాబాద్‌లో 50పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## స్కూళ్లు.. కమ్యూనిటీ హాళ్లు

కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు కరువు

# ఇవే జీపీ కార్యాలయాలు

జహీరాబాద్, మార్చి 28: అభివృద్ధికి పట్టుకొమ్మలుగా చెప్పుకునే గ్రామ పంచాయతీలను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం వాటి నిర్వహణ సంగతి పక్కన పెడితే.. పక్కా భవనాలు ఏర్పాటు దిశగా ఏ మాత్రం శ్రద్ధ చూపలేదు. దీంతో గ్రామాల్లోని పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామ పంచాయతీ పాలనా కేంద్రాలుగా మారాయి. పాలనా సౌలభ్యం కోసం 2018లో గత ప్రభుత్వం ప్రతీ 500 జనాభా ఉన్న ప్రతి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఒక్క జహీరాబాద్ నియోజకవర్గంలోనే కొత్తగా ఏర్పాటైన 25 గ్రామపంచాయతీలతో కలిపి, 135పై చిలుకు గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో చాలా గ్రామపంచాయితీలకు పక్కా భవనాలు లేవు. పాఠశాలల్లో, కమ్యూనిటీ హాళ్లలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలను పంచాయతీ భవనాలుగా ఏర్పాటు చేశారు. అలాగే, వివిధ కమ్యూనిటీల వారి అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనాల్లోనూ గ్రామపంచాయతీ పాలకవర్గం కొలువుదీరింది. కొన్ని గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నిధులు లేకపోవడం, స్థల సమస్యతో ముందడుగు పడలేదు.



హుగ్గెల్లి తండాలో పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం



అర్జున్‌నాయక్‌తండాలో కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం




మధులై తండాలో అంగన్‌వాడి కేంద్రంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

### సొంత భవనం లేక ఇబ్బందులు



గత ప్రభుత్వం తండాను గ్రామపంచాయతీగా మార్చినప్పటికీ సొంత భవనం లేకపోడంతో ప్రజలతో పాటు అధికారులూ ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ పనులు చేపట్టినా.. ఏడాదిగా అవి నత్తనడకన సాగుతున్నాయి. వెంటనే పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

- భీంరావ్ రాథోడ్, హుగ్గెల్లితండా

## నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్లను ఏర్పాటు చేయాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గజ్వేల్, మార్చి 28: నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్లను ఏర్పాటు చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని పలు లేఅవుట్‌లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్యకు పలు సూచనలు చేశారు. లేఅవుట్లలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, తప్పనిసరిగా నియమనిబంధనలను పాటించాలని ఆదేశించారు. వారితో డీపీవో దేవకీదేవీ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి వందనం, నీటిపారుదలశాఖ డీఈ మోత్యానాయక్, గజ్వేల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, టీపీవో శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

# సంతకు నిధుల చింత

● ఎన్నికల కోడ్‌తో నిలిచిన నిధుల మళ్లింపు
● చిరువ్యాపారులకు తప్పని తిప్పలు

మద్దూరు, మార్చి 28: మద్దూరు మండల కేంద్రంలో ఉపాధిహామీ, జీపీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన గ్రామీణ సంత పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. సెప్టెంబరు 26, 2021లో గ్రామీణ సంత నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శంకుస్థాపన చేశారు. నిధులు సరిపోకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టిన మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన కలెక్టర్ అదనంగా రూ.5 లక్షల మంజూరుకు హామీ ఇచ్చారు. ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు, జీపీ నిధులు రూ.5 లక్షలు, ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో కలిపి 30 గదులు, ప్లాట్‌ఫామ్, పార్కింగ్, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలతో పాటు ఆఫీసు, స్టోర్ రూం ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డుపైనే సంత కొనసాగిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు.

**షాపింగ్ క్లాంప్లెక్స్ నిధుల మళ్లింపునకు వినతి**

మే 13, 2022లో డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) ద్వారా మద్దూరు గ్రామపంచాయతీకి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ సంతకు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు జాడ లేకపోవడంతో అసంపూర్తి పనులు వెక్కిరిస్తున్నాయి. డీఎంఎఫ్‌టీ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంజూరైన నిధులను అసంపూర్తిగా ఉన్న సంత నిర్మాణ పనులకు మళ్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్ధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి రాతపూర్వకంగా వివరించారు. దీంతో సంబంధిత శాఖకు సిఫారస్ చేస్తూ రాసిన లేఖ కలెక్టర్ వద్దకు చేరింది. అయితే ఎలక్షన్ కోడ్ రావడంతో లేఖను పక్కకు పెట్టేశారు.



మద్దూరులో రోడ్డుపైనే నిర్వహిస్తున్న సంత



మద్దూరులో అసంపూర్తిగా సంత నిర్మాణాలు

**నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి**



ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల కాకపోవడంతో సంత నిర్మాణ పనులు అసంపూర్తిగా మారాయి. డీఎంఎఫ్‌టీ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్‌కు మంజూరైన నిధుల మళ్లింపు చేపట్టి, అసంపూర్తి సంత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సహకరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

- మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి

## వైద్యసేవల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ట శ్రీనివాస్

హుస్నాబాద్/కొండపాక మార్చి 28 : వైద్య సేవల్ల జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ట శ్రీనివాస్ సూచించారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయి వైద్యులు, వైద్య సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభాకర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు వినోద్ బాబ్జీ, శ్రీదేవి, విజయారాణి, శ్రీనివాస్, ఎఓ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు. కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. అంకితభావంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించడానికి విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ సందర్భంగా మొదటిసారిగా పీహెచ్‌పీకి వచ్చిన వైద్యాధికారినిని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాతో సత్కరించి పూల మొక్క అందజేశారు.



కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సత్కరిస్తున్న సిబ్బంది

## అన్నం పెట్టే రైతన్నలను ఆదుకోండి

● బీజేపీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్ రావు

నంగునూరు , మార్చి 28: అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రాజెక్టులు కట్టించామని గొప్పలు చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలదేనని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. గురువారం నంగునూరులో బీజేపీ మండల స్థాయి కార్యకర్తలకు నిర్వహించిన సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం నీళ్లు ఇస్తున్నామని చెప్పే నాయకులు నంగునూరు మండలంలోని చివరి గ్రామం వరకు నీళ్లు అందేలా చూడాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బైరి శంకర్, యాదమల్లు, రజనీకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్యాల రాజు, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి**

సిద్దిపేటరూరల్, మార్చి28: బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు కోరారు. రాఘవాపూర్ గ్రామంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సిద్దిపేట రూరల్ మండలం బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పట్టుకొమ్మలని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి, నాయకులు ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



నంగనూరులోని సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్ రావు

## పీహెచ్‌సీ ఉన్నా అంబులెన్స్ లేదు

● ఇబ్బందులు పడుతున్న రోగులు



కుకునూరుపల్లి పీహెచ్‌సీ

కుకునూరుపల్లి, మార్చి 28: కుకునూరుపల్లి మండలం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా, మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ దీనికి అనుబంధంగా అంబులెన్స్ సౌకర్యం లేదు. గత ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కొండపాక మండలంలోని కొన్ని గ్రామాలను జగదేవ్‌పూర్ మండలంలోని మరి కొన్ని గ్రామాలను కలుపుకొని నూతనంగా కుకునూరుపల్లి మండలాన్ని ఏర్పాటు చేసింది. గతంలో ఈ సమస్యపై పలువురు ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వ ఉన్నత అధికారులు, మాజీ మంత్రులకు వినతి పత్రాలు కూడ అందజేశారు. అంతలోనే ప్రభుత్వం మారింది. 108కు ఫోన్ చేస్తే ఇటు కొండపాక మండలం దుద్దెడ నుంచి రావడానికి దాదాపు ముప్పయి నుంచి నలభై నిమిషాల సమయం, అలాగే గజ్వేల్ నుంచి రావడానికి 30 నిమిషాల సమయం పడుతున్నది. క్షతగాత్రులను, రోగులను గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడానికి మరో 30-40 నిమిషాల సమయం పడుతున్నది. దీంతో రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అంబులెన్స్‌ను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## అవి నకిలీ మందులు కాదు

● వ్యవసాయశాఖ ఏడీఏ బాబునాయక్

కొండపాక, మార్చి 28: కొండపాక మండలం దుద్దెడకు చెందిన చిలుముల శ్రీనివాస్ అనే రైతు వెలికట్ట శివారులోని పురుగుల మందు దుకాణంలో తెచ్చిన మందులు నకిలీవి కావని పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు వ్యవసాయ శాఖ గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బాబునాయక్ వెల్లడించారు. గురువారం ఐటీసీ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శినితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పురుగుల మందు దుకాణంలో రైతు ఈ నెల 10న మందులు తీసుకపోవడం వల్లనే వరిచేను నష్టపోయిందని ఆందోళనకు దిగాడని, దాంతో వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీ శాస్త్రవేత్తలు వ్యవసాయ క్షేత్రంలోని నష్టపోయిన వరి ఆకులను, వరి పంటకు వాడిన మందులను టెస్టింగ్ కోసం రాజేంద్రనగర్‌లోని ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. పరీక్షల్లో తెగుళ్ల కోసం తీసుకెళ్లిన మందులు సరైనవేనని, మందులతోపాటు గడ్డి మందు కలపడంతో చేను దెబ్బతిన్నట్టుగా తేలిందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి మందులు తీసుకెళ్లాలని అలాగే రశీదులు తీసుకోవాలని తెలిపారు. రశీదులుంటే కంపెనీ నుంచి నష్టం పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ

**ఈనెల 30న మల్లన్న ఆలయంలో హుండీలెక్కింపులు**

చేర్యాల, మార్చి 28 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో ఈనెల 30వతేదీన కానుకలు, ఒడిబియ్యం హుండీలు లెక్కించనున్నట్లు ఈవో బాలాజీ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

**గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పండరి**

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెన్‌రాజ్ పండరి ఎన్నికయ్యారు. గజ్వేల్ పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలువగా 38ఓట్ల మెజారిటీతో చెన్‌రాజ్ పండరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళీమోహన్**

హుస్నాబాద్, మార్చి 28 : హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విలాసాగరం మురళీ మోహన్ ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా కన్నోజు రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా గూగులోతు జుంలాల్, సహాయ కార్యదర్శిగా జేరిపోతుల రవీందర్, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా దీకొండ ప్రవీణ్ కుమార్‌లు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి జాల జ్యోతికుమార్ తెలిపారు. అనంతరం ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని నూతన కార్యవర్గాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

**మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామకం**

సిద్దిపేట, మార్చి 28 : మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన బుట్టి సత్యనారాయణ నియామకమయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేశ్ చేతులమీదుగా గురువారం నియామక పత్రం అందుకున్నాడు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ మాలమహానాడు పటిష్టతకు చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంలో బయోచార్ పాత్ర కీలకం

● జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

మర్కుక్, మార్చి 28: ఆయిల్‌పామ్, కూరగాయ తోటలు సాగుచేసే రైతులు బయోచార్ ఎరువును వాడితే నేల సారవంతంతో పాటు మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. గురువారం మండలంలో నూజివీడుసీడ్స్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 200 మెట్రిక్ టన్నుల బయోచార్ సేంద్రీయ ఎరువును నూజివీడు సీడ్స్ ఏజీఎం నర్సింహారెడ్డి మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డితో కలిసి రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ ప్రతినిధులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, రైతులు బిక్షపతి, వెంకట్‌రెడ్డి, నర్సింలు, కిష్టారెడ్డి, బిక్షపతి పాల్గొన్నారు.

## వైరల్ ఫీవర్ బాధితులకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, మార్చి 28: చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో వైరల్ ఫీవర్‌తో ప్రజలు బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం గ్రామంలో మండల వైద్యాధికారి సాయి సింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల నుంచి కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, వైరల్ ఫీవర్‌తో ప్రజలు బాధపడుతున్నట్లు తెలుసుకుని వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి హారిక, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా అంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

రాయపోల్, మార్చి 28: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. గురువారం ఉదయం మధుసూదనానందస్వామి, వేద పండితులు శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ముహూర్త సమయానికి అంజనేయస్వామి విగ్రహంతోపాటు నవగ్రహ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

**కాసులాబాద్‌లో**

మిరుదొడ్డి, మార్చి 28: మండలంలోని కాసులాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం పెద్దమ్మ, పెద్దరాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సహం ఘనంగా ప్రారంభమైంది. మూడురోజులపాటు పూజకార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 30న పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజను ఆలయకమిటీ సభ్యులు చేశారు. గ్రామంలోని కూడవెల్లి వాగు సమీపంలో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజను చేస్తున్న కమిటీ సభ్యులు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న మధుసూదనానందస్వామి

## 'విద్యార్థి దశ నుంచే సమాజసేవను అలవరుచుకోవాలి'

గజ్వేల్, మార్చి 28: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సమాజసేవకు అలవాటుపడాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరాలను నిర్వహించడంతో విద్యార్థులలో సమాజ సేవపై అవగాహన కలుగుతుంన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు, ఎన్ఎస్ఎస్ ప్రత్యేకాధికారి విజయభాస్కర్, అధ్యాపకులు రాంచంద్రం, ఓం ప్రకాశ్, రాజు, కైలాష్, సాయికృష్ణ, రాజశేఖర్, లావణ్య, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణ, ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు సుకేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం..

నర్సాపూర్, మార్చి 28: నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ సమీపంలోని ఓ హ్యాచరీస్ సంస్థ ఎస్సీలకు చెందిన భూములను గతంలో తీసుకుంది. ఆ సమయంలో కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నదని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బైలపాటి గణేష్ అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కమలాద్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి కాగజ్‌మద్దూర్, రేండ్లగూడ గ్రామపరిధిలోని ఎస్సీల భూములను తీసుకున్న హ్యాచరీస్ సంస్థ యాజమాన్యం హామీ నెరవేర్చలేదన్నారు. అందుకు ఆ సంస్థపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలని గణేష్ కోరారు.

# బిల్లులు మంజూరు కాక.. ముందుకు సాగని పనులు

● నిలిచిన మాతా శిశు ఆరోగ్య కేంద్ర పనులు
● 80 శాతానికి పైగా పనులు పూర్తి
● ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి

హుస్నాబాద్ టౌన్, మార్చి 28: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద చేపట్టిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలిసింది. ఇప్పటికీ దాదాపు 80 శాతానికి పైగా ఈ పనులు పూర్తయ్యాయి. సంవత్సరం దాటుతున్నా పనులు పూర్తి కాకపోవడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే కోట్ల రూపాయల పనులు చేశామని, వాటికి సంబంధించిన బిల్లులు రానప్పుడు ఎలా పని చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ పేర్కొంటున్నాడు.



హుస్నాబాద్‌లో నిర్మాణం జరుగుతున్న మాతా శిశు ఆరోగ్య కేంద్ర

**ఏడాది దాటినా..**

హుస్నాబాద్ అత్యధికంగా గిరిజనులుండి వైద్య రంగంలో వెనుకబడిపోయిన ప్రాంతం. హుస్నాబాద్ పట్టణం నుంచి 40 కిలోమీటర్లు దూరం పోతే తప్పా పెద్ద ఆస్పత్రులు లేవు. మాతా శిశువు ఆరోగ్య పరీక్షల నిమిత్తం సిద్దిపేట, హన్మకొండ, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్లాల్సి ఉండటంతో గత ప్రభుత్వం 2.8.2022న మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రూ. 7.50 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం పక్కన మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి 2022 డిసెంబర్ 5న అప్పటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ. 5 కోట్ల వరకు పనులు చేశారు. ఇప్పటి వరకు రూ. 1.40 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇంకా రూ. 3.50 కోట్లు రావాల్సి ఉందని తెలిసింది. బిల్లులు రాక పోవడంతోనే కొద్ది రోజుల నుంచి కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు సమాచారం. ఇలా అయితే మరో ఆరు నెలలు గడిచినా పనులు పూర్తయ్యే అవకాశం లేదు.

**అందుబాటులోకి వస్తే ఎంతో ఉపయోగం**

50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తల్లి బిడ్డల ఆరోగ్య చికిత్సల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అంతే కాకుండా వైద్య నిపుణులు నిత్యం అందుబాటులో ఉంటారు. ఈ పనులు త్వరితగతిన పర్తి చేయాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

దుబ్బాక, మార్చి 28: ప్రజాస్వామ్యలో ఓటుహక్కు వజ్రాయుధమని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు హక్కును ప్రతీ పౌరుడు వినియోగించుకోవాలన్నారు. లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకే ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓటు ద్వారా మంచినాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. అన్ని పార్టీలు సామరస్యంగా, శాంతియుతంగా ఎన్నికలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్ఐ పరుశురామ్, అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ రవికాంత్ తదితులున్నారు.

## గోవిందాపూర్‌లో తాళం వేసిన ఇళ్లలో చోరీ



బీరువాలోని దుస్తులను చిందర వందర చేసిన దృశ్యం

వర్గల్, మార్చి 28: వర్గల్ మండలం గోవిందాపూర్ గ్రామంలో తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గౌరారం ఎస్ఐ శివకుమార్ గురువారం వివరాలను తెలిపారు. గ్రామానికి చెందిన లింగ శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి ఉండటంతో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, 90 తులాల వెండి వస్తువులను దోచుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన కేసరి రామవ్వ ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న తులం బంగారం, 28 తులాల వెండి వస్తువులు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేద్దాం

● బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివకుమార్

గజ్వేల్, మార్చి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేద్దామని బీజేపీ ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పిలుపునిచ్చాడు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీని ప్రకటించాడు. ఉపాధ్యక్షుడిగా కూరారం బాల్‌నర్సయ్య(చేర్యాల), మారాటి బాబు(దుబ్బాక), జక్కుల వెంకటేశ్(సిద్దిపేట), వట్కూరి కనకయ్య(చిన్నకోడూరు), ప్రధాన కార్యదర్శులుగా మన్నె శేఖర్(గజ్వేల్), గజ్వేల్ రాంచంద్రం(రాయపోల్), కార్యదర్శులుగా మన్నె శ్రీనివాస్(తొగుట), మక్క అనిల్(నంగునూరు), మల్లమల సురేందర్(సిద్దిపేట), అచ్చంగారి ఏగొండ(మర్కుక్), కోశాధికారిగా మానేరు నాగరాజు(మిరుదొడ్డి), అధికార ప్రతినిధులుగా దాసరి గణేశ్(నారాయణరావుపేట), దుబ్బ రాజు(భూంపల్లి), బర్రె కిషన్(కొండపాక), ఎర్రబచ్చల సురేశ్(మద్దూరు), సోషల్ మీడియా కన్వీనర్‌గా కుకునూరు రాము(జగదేవ్‌పూర్), కోకన్వీనర్‌గా వి.సాగర్(చిన్నకోడూరు), కార్యవర్గ సభ్యులుగా ముక్కిడి సామేల్(మర్కుక్), పెర్క రమేశ్(కుకునూరుపల్లి), తుడుం రమేశ్(ములుగు)లను నియమించినట్లు తెలిపారు.

## బీజేపీ మండల కమిటీ నియామకం

కుకునూరుపల్లి, మార్చి 28: కుకునూరుపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి మండల కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా సున్నం అశోక్, కూరెళ్ల నాగేందర్‌రెడ్డి, గట్టు అనిల్, బోనాల రాజు, పోచమైన స్వామి, ప్రధాన కార్యదర్శులుగా దాసరి స్వామి, రెడ్డమైన నాగరాజు, పాపగౌని సదానంద గౌడ్‌లను నియమించారు. కోశాధికారిగా పెద్ది రమేష్‌ను, పలువురిని కార్యదర్శులుగా నియమించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడిగా ఈసాల నవీన్‌ను, అధికారప్రతినిధిలను, పలు మోర్చా అధ్యక్షులను, సోషల్ మీడియా, ఐటి సెల్ కన్వీనర్లును నియమించారు. మండల కమిటీ నియమించిన అనంతరం సోషల్ మీడియా వేదికగా పలువురు బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ కార్యకర్తలుగా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ, తమకు స్థానం కల్పించడం లేదని ఒకే గ్రామానికి రెండు పదవులను అనుభవం లేని వారికి కట్టబెట్టారని వారు ఆవేదన 0వ్యక్తం చేస్తున్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన అవసరం

●ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్

దౌల్తాబాద్, మార్చి 28: సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. గురువారం మండల పరిధిలోని హైమద్‌నగర్ గ్రామ చౌరస్తాలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడ్డప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం


● మద్దూరు ఎస్ఐ



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మద్దూరు, మార్చి 28: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మద్దూరు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ అన్నారు. మండలంలోని లద్నూరులోని ప్రభుత్వ ఎంపీపీఎస్ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి పాఠశాల హెచ్ఎం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. కార్పొరేట్ పోటీ తత్వం ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతంలోని లద్నూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉండటంతో పాటు వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడంపట్ల అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో మొగుల్ల నర్సింహ్మారెడ్డి, విద్యావేత్త పి.రాంమూర్తి, జడ్పీఎస్ఎస్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఎస్ఎంసీ చైర్మన్ శారద పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో వార్షికోత్సవ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్, మార్చి 28: హుస్నాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయి అనేది ప్రతీ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనదని, క్రమ శిక్షణతో చదివితే అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థలు విజయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, జనగామ రత్నమాల తదితరులున్నారు.

## వ్యభిచార గృహంపై దాడి.. ఐదుగురి అరెస్టు

సంగారెడ్డి క్రైం, మార్చి 28: సంగారెడ్డి పట్టణంలోని ఓ లాడ్జిలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. పట్టణంలోని సాయిబాబా లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గురువారం తనిఖీ చేసినట్లు తెలిపారు. లాడ్జి యజమాని సందీప్‌బాబు, మేనేజర్ లింగం, లాడ్జి పక్కనే ఉన్న మెకానిక్ నజీర్ అహ్మద్‌లతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో బాధితులైన మహిళలను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిస్క్యూ హోంకు తరలించినట్లు తెలిపారు.